# ఆంధ్రదేశంలో బ్రిటిష్ పాలన ఏర్పాటు

పోర్చుగీసు, డచ్చి, ఇంగ్లిష్, ఫ్రెంచ్ లాంటి యూరోపియన్ల రాకతో ఆంధ్రదేశ చరిత్రలో ఆధునికయుగం ఆరంభమైంది. ఐరోపా నుంచి భారత్‌కు సముద్రమార్గాన్ని కనుగొనడంతో వీరి రాక సుగమం అయింది. పోర్చుగల్ నావికుడు వాస్కోడిగామా క్రీ.శ. 1498 మే 27న భారత పశ్చిమ తీరంలోని కాలికట్ (కేరళ)లో కాలు మోపాడు. అలా భారత్‌కు సముద్రమార్గం కనుగొన్న ఐరోపా దేశస్థుడిగా ప్రసిద్ధికెక్కాడు. 18-19 శతాబ్దాల్లో ఆంధ్రదేశంపై రాజకీయ ఆధిపత్యం పొందడానికి తద్వారా వ్యాపారలాభాలు పొందడానికి యూరోపియన్ కంపెనీలు పోటీపడ్డాయి.

మన రాష్ట్రంలో తొలిసారిగా వర్తకస్థావరాన్ని ఏర్పాటు చేసిన యూరోపియన్లు - డచ్చివారు. క్రీ.శ. 1605లో మచిలీపట్నంలో డచ్ వర్తక స్థావరం మొదటగా ఏర్పాటైంది. వీరికి వ్యాపార అనుమతి ఇచ్చిన గోల్కొండ సుల్తాన్ మహ్మద్ కులీ కుతుబ్‌షా. క్రీ.శ. 1606లో నిజాంపట్నంలోనూ, 1610లో పులికాట్ ఆపై నర్సాపురం, భీమునిఎట్నం, యానాంలలోనూ డచ్ స్థావరాలేర్పడ్డాయి. భారత్‌లో డచ్చివారి స్థావరాలన్నింటికీ క్రీ.శ. 1689 వరకు పులికాట్ ప్రధాన కేంద్రం కాగా ఆ తర్వాత మద్రాసు సమీపంలోని నాగపట్టణం ప్రధాన కేంద్రమైంది.

ఇక బ్రిటీష్‌వారు క్రీ.శ. 1608లో కెప్టెన్ హాకిన్స్ నాయకత్వంలో తొలిసారిగా మన దేశంలోని సూరత్‌లో కాలుమోపారు. బంగాళాఖాత తీర ప్రాంతంలో వర్తక వ్యాపారాలు నెరిపే అంశాన్ని పరిశీలించేందుకు ఆంగ్లేయులు ప్రయత్నించారు. అందులో భాగంగా క్రీ.శ. 1611లో కెప్టెన్ హిప్పన్ నేతృత్వంలో గ్లోబ్ అనే బ్రిటిష్ నౌక మచిలీపట్నం చేరింది. బ్రిటిష్ వారికి ఇక్కడ వర్తక స్థావరం ఏర్పరచుకునేందుకు అనుమతినిచ్చింది కూడా మహ్మద్ కులీ కుతుబ్‌షాయే. మొత్తం భారత్‌లోనే బ్రిటిష్ వారి తొలి వర్తక స్థావరం మచిలీపట్నం. వారు తమ రెండో స్థావరాన్ని క్రీ.శ. 1613లో సూరత్‌లో ఏర్పాటు చేశారు.

ఆ కాలంలో గోల్కొండ సామ్రాజ్యం ప్రపంచమంతటా వజ్రాల వ్యాపారానికి పేరొందింది. వజ్రాలు, పగడాలు, రంగు వస్త్రాలు, కలంకారీలు మొదలైనవి మచిలీపట్నం రేవు నుంచి ఎగుమతి అయ్యేవి. ఈ కారణంతోనే బ్రిటిష్‌వారు తూర్పుతీరంలో మచిలీపట్నాన్ని ఎన్నుకొన్నారు. అయితే పోర్చుగీసు వారి నుంచి వ్యతిరేకత, నవాబు సహకారం లేకపోవడం లాంటి కారణాలతో బ్రిటిష్‌వారు మచిలీపట్నాన్ని విడిచి వెళ్ళాల్సి వచ్చింది. క్రీ.శ. 1626లో వీరు నెల్లూరు జిల్లాలోని పులికాట్ దగ్గర ఉన్న ఆర్మగంలో స్థావరం నెలకొల్పారు.

కాని ఆర్మగం వ్యాపారానికి అనువైన ప్రాంతం కాదు. పైగా ఇక్కడ ఆంగ్లేయుల వస్త్ర వ్యాపారానికి అవసరమైన పత్తి పండించడానికి అనుకూలత లేదు. దీంతో మరో స్థావరం కోసం వెతుకుతున్న బ్రిటిష్ వారిని తిరిగి మచిలీపట్నం రమ్మని గోల్కొండ నవాబు అబ్దుల్లా హుస్సేన్ కుతుబ్‌షా ఆహ్వానించారు. బ్రిటీష్‌వారు తిరిగి వచ్చినా - కరువు కాటకాల వల్ల బ్రిటిష్‌వారు మచిలీపట్నం కాకుండా వేరే స్థావరాన్ని చూసుకోవాల్సి వచ్చింది.

మరో స్థావర ఏర్పాటుకు బ్రిటిష్ ప్రతినిధి ఫ్రాన్సిస్‌డే ప్రయత్నాలు చేయడం దామెర్ల వెంకటాద్రినాయుడికి తెలిసింది. చంద్రగిరి రాజయిన మూడవ వెంకటపతి రాయల స్థానిక ప్రతినిధే ఈ నాయుడు. ఈయన చంద్రగిరి రాజ్యభూభాగంలో స్థావరం ఏర్పాటు చేసుకోవాలని ఫ్రాన్సిస్‌డేకు కబురు పంపాడు. అంతేకాదు - మద్రాసు పట్టణం వద్ద ఫ్యాక్టరీని, కోటను నిర్మించుకొనేందుకు క్రీ.శ. 1639 జూలైలో చంద్రగిరి ప్రభువు అనుమతిచ్చాడు. క్రీ.శ. 1640లో సెయింట్ జార్జి కోట నిర్మాణం జరగడం, బ్రిటీష్ ఫ్యాక్టరీలకు మద్రాసు కేంద్రంగా ప్రకటితం కావడం జరిగింది. ఇలా ఏర్పడిన ఈ నూతన నగరానికి దామెర్ల వెంకటాద్రి నాయుడి తండ్రి చెన్నప్ప పేరిట 'చెన్నప్ప పట్టణం' అయి, ఆపై చెన్నపట్టణంగా స్థిరపడింది. బ్రిటిష్ వారు క్రీ.శ. 1682లో విశాఖలోనూ, తూర్పుగోదావరి జిల్లాలోని ఇంజరంలోనూ ఫ్యాక్టరీలు నెలకొల్పారు.

ఇక ఫ్రెంచివారు క్రీ.శ. 1669లో మచిలీపట్నంలోనూ, క్రీ.శ. 1708లో యానాంలోనూ స్థావరాన్ని స్థాపించుకొన్నారు. అట్లే పోర్చుగీసువారు క్రీ.శ. 1670లో తమ తొలి స్థావరాన్ని మచిలీపట్నంలో ఏర్పాటు చేసుకొన్నారు.

స్థానిక రాజకీయాలలో జోక్యం చేసుకొనే విధానం ప్రారంభించిన వారు ఆంగ్లేయులు. దాంతో వ్యాపార ఆధిపత్యం కోసం యూరోపియన్ కంపెనీలు పరస్పర యుద్ధాలకు పాల్పడ్డాయి. స్థానిక ఆంధ్ర పాలకుల అనైక్యత విదేశీయులకు మరింత లాభించింది. దక్కన్ కర్ణాటక ప్రాంతాల్లో ఆధిపత్యానికై ఇంగ్లిష్ ఫ్రెంచి కంపెనీలు చేసిన మూడు యుద్ధాల్ని కర్ణాటక లేదా ఆంగ్లో-ఫ్రెంచి యుద్ధాలు అంటారు.

మొదటి కర్ణాటకయుద్ధం (క్రీ.శ. 1746 - 48) వల్ల భారత సైన్యంలోని బలహీనతలు ఐరోపా వారికి బహిర్గతమయ్యాయి. ఇది భారతదేశ చరిత్రగతిని మార్చిన యుద్ధాలలో ఒకటి. ఈ దశలోనే రాబర్ట్ క్లైవ్ నాయకత్వంలో ఇంగ్లిష్‌వారు కర్ణాటకలోను, బుస్సీ నాయకత్వంలో ఫ్రెంచివారు దక్కనులోను ఆధిపత్యం నెలకొల్పుకొన్నారు. ఫ్రెంచివారి ప్రాబల్యాన్ని తగ్గించేందుకు ఆంగ్లేయులు చేసిన ప్రయత్నం రెండో కర్ణాటక యుద్ధానికి (క్రీ.శ. 1749 - 56) దారి తీసింది.

క్రీ.శ. 1748లో దక్కన్ సుబేదార్ నిజాం ఉల్‌ముల్క్ మరణంతో వారసత్వ పోరు ప్రారంభమైంది. నిజాం కుమారుడు నాజర్‌జంగ్ దక్కన్ సుబేదారుగా ప్రకటించుకొన్నాడు. ఈ అదును చూసి - ఇంగ్లిష్

SAKSHI

వారు కర్ణాటక నవాబు కుమారుడైన మహ్మద్ ఆలీ, నాజర్ జంగ్‌ల పక్షాన నిలిచారు. మరోవైపు ఫ్రెంచివారు నిజాంఉల్‌ముల్క్ మనవడు ముజఫర్ జంగ్, అతని మిత్రుడు చందాసాహెబ్ పక్షాన నిలిచాడు.

ఆంగ్లేయుల మద్దతుతో నాజర్‌జంగ్ కర్ణాటకపై దండెత్తి ముజఫర్ జంగ్‌ను ఓడించి బందీగా పట్టుకోవడం జరిగింది. చందాసాహెబ్ పుదుచ్చేరికి పారిపోయాడు. నాజర్‌జంగ్ హత్యకు గురయ్యాడు. ఫ్రెంచి గవర్నర్ డూప్లే – ముజఫర్ జంగ్‌ను విడుదల చేయించి దక్కను సుబేదార్‌గా ప్రకటించాడు. అందుకు ప్రతిఫలంగా ఫ్రెంచివారికి ముజఫర్ జంగ్ కోరమాండల్ తీరంలోని వల్దపూరు, విల్లియనూరు, బాహూరులను; ఆంధ్ర తీరంలోని దివి, మచిలీపట్టణాల్ని ఇచ్చారు. డూప్లేను ముజఫర్ జంగ్ కృష్ణానదీ తీరప్రాంతానికి నవాబుగా ప్రక టించాడు.

దక్కన్ సుబేదారుగా ప్రకటితమైన ముజఫర్ జంగ్ బుస్సీ రక్షణలో పుదుచ్చేరి నుంచి హైదరాబాద్ వస్తుండగా – కడప, కర్నూలు, నవ నూరు నవాబులు కుట్రపన్ని కడప దగ్గరి లక్కిరెడ్డిపల్లి వద్ద ముజఫర్ జంగ్‌ను హత్య చేయించారు. వెంటనే బుస్సీ చతురత కనబరచి – నిజాం ఉల్‌ముల్క్ నాల్గవ కుమారుడైన సలాబత్‌జంగ్‌ను దక్కన్ సుబేదార్ (హైదరాబాద్ నవాబు)గా ప్రకటించాడు. హైదరాబాద్‌లో ఉన్న ఫ్రెంచి సైన్య పోషణకు సులాబత్ జంగ్ ఉత్తర సర్కారులైన ముస్తఫా నగర్ (కొండపల్లి), ఏలూరు, రాజమండ్రి, చికాకోల్ (శ్రీకాకుళం) సర్కార్లను ఫ్రెంచ్‌వారి పరం చేశాడు.

ఇలా క్రీ.శ. 1757 నాటికి గంజా (ఇప్పటి ఒరిస్సాలోనిది) గుంటూ రు వరకు ఉన్న ఆంధ్ర ప్రాంతం ఫ్రెంచివారి ఆధీనంలోకి వచ్చింది. అయితే ఈ సర్కారుల్ని స్వాధీనం చేసుకోవడంలో బుస్సీ అనేక ఇబ్బం దులను ఎదుర్కొన్నాడు. ఆయా సర్కార్ల పాలకులు బుస్సీకి అంత త్వరగా లొంగలేదు. మరోవైపు హైదరాబాద్ నిజాం దర్బారులోని కొందరు ప్రముఖులకు హైదరాబాద్‌లో ఫ్రెంచివారి ప్రాబల్యం నచ్చలేదు. వారు నిజాంపై ఒత్తిడి తెచ్చి బుస్సీని అధికారం నుంచి తొలగిస్తున్నట్లు క్రీ.శ. 1756లో ఉత్తర్వులు జారీ చేయించారు. అయితే బుస్సీ వాటిని ఖాతరు చేయలేదు. పైగా బుస్సీ కయ్యానికి కాలు దువ్వాడు. హైదరాబాద్‌లోని చారుమహల్ వద్ద యుద్ధం జరిగింది. చివరకు సంధి జరిగి బుస్సీ పూర్వ వైభవం పొందాడు.

మరో వైపు నిజాం దర్బారు నిర్ణయాన్ని తెలుసుకొన్న సర్కారు పాలకులు బుస్సీ ఆధిపత్యాన్ని వ్యతిరేకించడం మొదలుపెట్టారు. విజయగనర జమీందారయిన విజయరామరాజు తప్ప రాజమండ్రి, శ్రీకాకుళం తదితర జమీందార్లో ఫ్రెంచివారికి శిస్తుల చెల్లింపులు మానేశారు. దాంతో బుస్సీ తానే రంగంలోకి దిగి సర్కారు జిల్లాల పర్యటనకు వచ్చాడు.

ఈ పర్యటనలో విజయరామరాజు బుస్సీకి ప్రధాన సలహాదా రుడయ్యాడు. బొబ్బిలి జమీందార్లు కూడా ఫ్రెంచివారికి శిస్తు బకాయి పడ్డారు. విజయనగరానికి బొబ్బిలికి చాలా కాలం నుంచి శత్రుత్వం ఉంది. ఇదే అదను అనుకొని విజయరామరాజు బుస్సీని పురిగొ ల్పాడు. దాంతో విజయరామరాజు ప్రోద్బలంతో ఫ్రెంచి సైన్యం బొబ్బిలిని ముట్టడించింది. క్రీ.శ. 1757 జనవరి 24న జరిగిన బొబ్బిలి యుద్ధంలో బొబ్బిలి జమీందారయిన రంగారావు వధించబడ్డాడు.

జమీందారు రంగారావు భార్య రాణి మల్లమ్మ దేవికి స్వయానా సోదరుడు తాండ్ర పాపారాయుడు. విజయనగర – ఫ్రెంచి సైన్యాలు బొబ్బిలిని ముట్టడిస్తున్నాయన్న వార్తను పాపారాయుడికి మల్లమ్మ పంపింది. అప్పటికి తాండ్ర పాపారాయుడు రాజాం దగ్గర ఉన్నాడు. కాని దురదృష్టవశాత్తూ పాపారాయుడికి ఆ వార్త అందలేదు. దాని ఫలితమే – రంగారావు వధ! మల్లమ్మ దేవి ఇంకా అనేక కుటుంబ సభ్యులు ఆత్మ త్యాగానికి పాల్పడ్డారు.

ఇది తెలుసుకొన్న తాండ్ర పాపారాయుడు – విజయ రామరాజుపై ప్రతీకారం తీర్చుకోవాలనుకొన్నాడు. విజయం సాధించిన ఆనం దంలో సైనిక గుడారాలలో ఉన్న విజయరామరాజు దగ్గరికి తాండ్ర పాపారాయుడు ఇద్దరు అనుచరులు – దేవులపల్లి పెద్దన్న, బుద్దరాజు వెంకయ్యలతో కలిసి అర్ధరాత్రిపూట వెళ్లాడు. విజయరామరాజుని వధించి తాను ప్రాణత్యాగం చేశాడు.

అయితే బొబ్బిలి పతనంతో మిగిలిన జమీందారులు కిమ్మన కుండా ఫ్రెంచి ఆధిపత్యాన్ని అంగీకరించారు. అలా 1758 నాటికి దక్కన్‌లో ఫ్రెంచి ప్రాబల్యం ఉన్నత స్థితికి చేరింది. గంజాం నుంచి గుంటూరు వరకు గల ఆంధ్రదేశం ఫ్రెంచివారి ఆధీనంలోకి రావడానికి కారణం బుస్సీయే.

మరోవైపు విజయరామరాజు తర్వాత విజయనగర జమీందారు అయిన ఆనంద గజపతిరాజుకి ఫ్రెంచివారితో అభిప్రాయభేదాలు ఏర్పడ్డాయి. బుస్సీ దక్కనును వదిలిపెట్టగానే ఆనందగజపతి శ్రీకా కుళం ఆక్రమించి బెంగాల్‌లోని ఆంగ్లసేనాని రాబర్ట్ క్లైవ్‌తో క్రీ.శ.1758 నవంబర్ 21న సంధి కుదుర్చుకున్నాడు. దీని ఆధారంగా క్రీ.శ. 1758 డిసెంబర్ 7న తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి సమీపాన చందుర్తి దగ్గర బ్రిటిష్ – విజయనగర సైన్యాలతో జరిగిన యుద్ధంలో కాన్ ఫ్లాక్స్ నేతృత్వంలోని ఫ్రెంచి సైన్యం ఓడిపోయింది. చెందుర్తి యుద్ధం వల్ల ఉత్తర సర్కారులపై ఫ్రెంచి వారు ఆధిపత్యాన్ని కోల్పోవాల్సి వచ్చింది.

ఆ కాలంలో ఉత్తర సర్కారులలో మచిలీపట్నం ఫ్రెంచివారి ప్రధానకేంద్రంగా ఉంది. (శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు, పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాల ప్రాంతానికి ఉత్తర సర్కారులని పేరు. యూరోపియన్లు ఆంధ్రదేశం వచ్చేనాటికి ఈ ప్రాంతం గోల్కొండ రాజ్యంలో అంతర్భాగం). మచిలీపట్నంలో ఫ్రెంచివారికి బలిష్టమైన కోట ఉంది. ఆ పట్టణాన్ని, కోటను వశపర చుకొంటేనే గాని ఫ్రెంచివారి అధికారం సంపూర్ణంగా నిర్మూలనం కాదని ఆంగ్లేయులు గుర్తించారు. ఇందుకు రంగం సిద్ధం చేశారు.

దాంతో ఫ్రెంచి వారికి సహాయం చేయడానికి నిజాం సలాబత్ జంగ్ గొప్ప సైన్యంతో మచిలీపట్నం బయలుదేరాడు. అతను అక్క డకు చేరకముందే మచిలీపట్నాన్ని వశపరచుకోవాలని బ్రిటిష్ అధికారి కల్నల్ ఫోర్డ్ నిశ్చయించాడు. విజయనగర – ఆంగ్ల సైన్యాలు నెలరోజులు ముట్టడించి క్రీ.శ. 1759 ఏప్రిల్ 8వ తేదీన మచిలీ

SAKSHI

పట్నాన్ని, కోటను స్వాధీనం చేసుకోవడం జరిగింది.

ఫోర్డ్‌తో పాటు వచ్చిన ఆనందగజపతి వెనకకు మరలి సామర్ల కోటకు వచ్చి పెద్దాపురం జమీందారు జగపతిరాజుని కొండూరు యుద్ధంలో ఓడించి చంపాడు. సామర్లకోట, పెద్దాపురం, పిఠాపురం కోటల్ని వశపరచుకొన్నాడు. ఇక ఫ్రెంచివారి పతనాన్ని గమనించిన హైదరాబాద్ నిజాం సలాబత్‌జంగ్‌కు బ్రిటీష్ వారితో క్రీ.శ. 1759 మే 14న సంధి కుదుర్చుకోవాల్సి వచ్చింది. ఈ సంధి ప్రకారం – మచిలీపట్నం, నిజాంపట్నం, కొండపల్లి సర్కారుల్ని బ్రిటిష్ వారికి నిజాం దత్తత చేయాల్సి వచ్చింది. గమనించాల్సిన విషయం ఏమి టంటే– ఈ సర్కారులన్ని బ్రిటిష్ వారి ఆధీనంలోకి రావడానికి ఎనిమిదేళ్లు పట్టింది.

ఏది ఏమైనా– రెండో కర్ణాటక యుద్ధ ఫలితంగా కర్ణాటక రాష్ట్రంలో నిలువ నీడను కోల్పోయిన ఫ్రెంచి వారు మూడో కర్ణాటక యుద్ధం (క్రీ.శ. 1756–1763) కాలంలో జరిగిన పరిణామాల పర్యవసానంగా దక్కన్‌పై తమకు ఉన్న పట్టుని పూర్తిగా పోగొట్టుకొన్నారు. ఉత్తరోత్తరా ఆంధ్ర దేశంలోని అత్యధిక భాగం మీద బ్రిటిష్ వారు ఆధిపత్యం సంపాదించుకోవడానికి మూడో కర్ణాటక యుద్ధం దారి ఏర్పరిచింది.

ఇది ఇలా ఉండగా– ఉత్తర సర్కారులకు సంబంధించి మరో ఆసక్తికర పరిణామం చోటు చేసుకొంది. క్రీ.శ. 1765లో అలహాబాద్ సంధి ద్వారా మొగల్ చక్రవర్తి షా ఆలం ఉత్తర సర్కారుల్ని తమకు దత్తం చేసేటట్లు బ్రిటిష్ వారు ఓ ఫర్మానా పొందారు. అయితే మొగల్ పాదుషా ఇచ్చిన ఫర్మానాను హైదరాబాద్ నిజాం నిజాం అలీఖాన్ తిరస్కరించాడు. దీంతో బ్రిటిష్ వారు నిజాం చెంతకు రాయబారిగా కాండ్రేగుల జోగి పండితులను పంపారు. ఈయన ద్విభాషి (దుబాసి) కావడం, హైదరాబాద్ సంస్థానంలో పలుకుబడి కలిగి ఉండటం లాంటి కారణాల వల్ల బ్రిటిష్ వారు ఇతన్ని ఎంపిక చేశారు. అయితే దౌత్యం ఫలించలేదు.

కాని అంతలో గొల్లపూడిలోని నిజాం సైన్యం తమ జీతం బకాయిల చెల్లింపు కోసం తిరుగుబాటు చేశారు. దాంతో గత్యంతరం లేక ఉత్తర సర్కారు జిల్లాల్ని 15 లక్షల రూపాయల కౌలుకి బ్రిటిష్ వారికి ఇవ్వడానికి నిజాం అంగీకరించాడు. ఇందుకు సంబంధించిన ఒప్పందం క్రీ.శ. 1766లో జరగగా ఇందుకు కృషి చేసిన ఆంగ్లేయ సేనాని కాలియిడ్.

గుంటూరు సర్కారును బ్రిటిష్ వారు స్వాధీనం చేసుకోవడానికి కొంత ఆలస్యమైంది. ఇందుకు కారణాలు లేకపోలేదు. వాస్తవానికి గుంటూరు సర్కారు కూడా ఉత్తర సర్కారు ప్రాంత పరిధిలోనిదే. కాని ఈ గుంటూరు సర్కారును జీవితాంతం అనుభవించే హక్కును తన తమ్ముడు, ఆదోని నవాబు అయిన బసాలత్ జంగ్‌కు నిజాం నవాబు ధారాదత్తం చేశాడు. ఎటొచ్చి బసాలత్ జంగ్ మరణానంతరం దీన్ని బ్రిటిష్ వారికి పరమయ్యేటట్లు నిజాం నిబంధనను రూపొందించాడు.

కాని బసాలత్ జంగ్ బ్రిటిష్ వ్యతిరేకి. ఇతడు ఫ్రెంచి సైన్యాన్ని సమకూర్చుకొని బ్రిటిష్‌పై ఎదురు తిరిగాడు. చివరకు బసాలత్ జంగ్ మరణానంతరం– 1788 సెప్టెంబర్ 18న గుంటూరు సర్కారును బ్రిటిష్ వారు స్వాధీనం చేసుకొన్నారు. ఇలా ఉత్తర సర్కారులు లభించిన 20 ఏళ్లకు క్రీ.శ. 1788 నాటికి గుంటూరు సర్కారు వశమై మొత్తం అయిదు ఉత్తర సర్కార్లను తమ సొంతం చేసుకోగలిగారు ఆంగ్లేయులు. మరోవైపు నెల్లూరు, చిత్తూరు మండలాలు క్రీ.శ. 1802 నాటికి బ్రిటిష్ పాలన కిందకు వచ్చాయి.

**దత్త మండలాల సంగతి!**

మన దేశంలో ఆంగ్ల సామ్రాజ్య విస్తరణను అరికట్టి ఆంగ్లేయుల్ని మన దేశం నుంచి పారద్రోలాలనే దృఢ సంకల్పంతో ఆంగ్లేయుల్ని ప్రతిఘటించినవారు– మైసూర్ సుల్తాన్ హైదర్ అలీ, ఆయన కుమారుడు టిప్పు సుల్తాన్. వీరు ఆంగ్లేయులతో చేసిన నాలుగు యుద్ధాలకే ఆంగ్లో–మైసూర్ యుద్ధాలని పేరు.

క్రీ.శ. 1782 నాటికి టిప్పు సుల్తాన్ రాయలసీమను తన ఆధీనంలోకి తెచ్చుకోగలిగాడు. అయితే క్రీ.శ. 1799లో జరిగిన నాల్గో మైసూర్ యుద్ధంలో టిప్పు సుల్తాన్ మరణించడంతో రాయలసీమ హైదరాబాద్ నిజాం ఆధీనంలోకి వచ్చింది. అయితే మహారాష్ట్ర దాడులకు భయపడిన నిజాం నవాబు అలీఖాన్ బ్రిటిష్ వారితో చేతులు కలపాల్సి వచ్చింది.

అందులో భాగంగా లార్డ్ వెల్లస్లీ ప్రవేశపెట్టిన సైన్య సహకార పద్ధతికి అంగీకరించి అలీఖాన్ క్రీ.శ. 1798లో బ్రిటిష్ వారి సహకారం పొందాడు. ఈ పద్ధతికి అంగీకరించిన తొలి స్వదేశీ రాజు నిజాం అలీఖాన్. దీని ఆధారంగా క్రీ.శ. 1800 అక్టోబర్ 12న ఆంగ్లేయులతో చేసుకొన్న ఒప్పందం ప్రకారం– ఆంగ్లేయ సైనిక పటాలాల ఖర్చు నిమిత్తం కడప, కర్నూలు, బళ్లారి, అనంతపురం ప్రాంతాల్ని ఆంగ్లేయులకు దత్తం చేశాడు. అందుకే వీటిని దత్తమండలాలు అంటారు. ఈ విధంగా క్రీ.శ. 1802 నాటికి నిజాం పాలనలోని తెలంగాణ ప్రాంతం తప్ప మిగిలిన ఆంధ్ర దేశమంతా బ్రిటిష్ వారి పూర్తి ఆధిపత్యం కిందకు వచ్చింది.

## ప్రాక్టీస్ బిట్స్

**1. కడప నవాబు నాజర్ జంగ్ హత్య జరిగిన స్థలం?**

ఎ) లక్కిరెడ్డిపల్లి బి) పులివెందుల

సి) జమ్మలమడుగు డి) రాయచోటి

**2. ఆంగ్లేయ విజయనగర సైన్యాలకు–ఫ్రెంచి సైన్యాలకు మధ్య జరిగినది?**

ఎ) కొండూరు యుద్ధం బి) చందుర్తి యుద్ధం

సి) వందవాసీ యుద్ధం డి) బొబ్బిలి యుద్ధం

**3. భారతదేశంలో పోర్చుగీసు వలస సామ్రాజ్య నిర్మాత?**

ఎ) వాస్కోడిగామా బి) క్లైవ్

సి) ఆల్బుకర్క్ డి) కార్లైల్

SAKSHI

4. గోల్కొండ సామ్రాజ్యం ఆనాడు ప్రధానంగా దేనికి ప్రసిద్ధి?

ఎ) పత్తి బి) వస్త్రాలు

సి) కలంకారీ డి) వజ్రాలు

5. మచిలీపట్నం చేరుకొన్న ఆంగ్లేయ నౌక?

ఎ) లాబ్ బి) షిప్

సి) గ్లోబ్ డి) ఏదీ కాదు

6. భారత్‌లో ఆంగ్లేయులు తొలుత అడుగుపెట్టినది ఎవరి నాయకత్వంలో?

ఎ) హాకిన్స్ బి) హిప్పన్

సి) వాస్కోడిగామా డి) రాబిన్స్

7. ఫ్రెంచి వర్తక సంఘం మచిలీపట్టణంలో ఎప్పుడు స్థావరం ఏర్పాటు చేశారు?

ఎ) 1673 బి) 1669 సి) 1690 డి) 1668

8. మొదటి కర్ణాటక యుద్ధ కాలం?

ఎ) 1743-49 బి) 1746-48

సి) 1749-56 డి) 1756-63

9. సలాబత్ జంగ్ చికాకోల్‌ను ఫ్రెంచి వారి పదం చేసిన సంవత్సరం?

ఎ) 1753 బి) 1755 సి) 1756 డి) 1757

10. సుమారుగా ఎప్పటికి బ్రిటిష్ వారు ఆంధ్ర, రాయలసీమలపై పూర్తి పట్టు సాధించారు?

ఎ) 1757 బి) 1947 సి) 1800 డి) 1900

11. నాల్గో మైసూరు యుద్ధ కాలం?

ఎ) 1799 బి) 1785 సి) 1770 డి) 1761

12. హైదరాబాద్ నిజాం సలాబత్ జంగ్ పటిష్టతకు తోడ్పడిన ఫ్రెంచి సేనాని?

ఎ) లాలీ బి) డూప్లే సి) యాషీ డి) బుస్సి

13. కోస్తా ఆంధ్ర ప్రాంతంపై అధికారం స్థాపించిన తొలి విదేశీ వర్తక సంఘం?

ఎ) డచ్ బి) పోర్చుగీస్

సి) ఫ్రెంచి డి) బ్రిటిష్

14. 1856 నాటికి ఆంధ్ర దేశ జిల్లాల సంఖ్య?

ఎ) 6 బి) 8 సి) 9 డి) 15

15. కింది వాటిలో దత్త మండలంలో లేనిది?

ఎ) కర్నూలు బి) కడప

సి) చిత్తూరు డి) అనంతపురం

16. రాయలసీమకు ఆ పేరు పెట్టినవారు?

ఎ) గాడిచర్ల హరిసర్వోత్తమరావు బి) సిపి బ్రౌన్

సి) థామస్‌మన్రో డి) ఎవరూ కాదు

17. బొబ్బిలి యుద్ధం జరిగిన సంవత్సరం?

ఎ) 1759 బి) 1800 సి) 1900 డి) 1757

18. వందవాసి యుద్ధం జరిగిన సంవత్సరం?

ఎ) 1760 బి) 1759 సి) 1761 డి) 1777

19. స్థానిక రాజకీయాల్లో జోక్యం చేసుకొనే విధానం ప్రారంభించిన వారు?

ఎ) బ్రిటిష్ వారు బి) ఫ్రెంచి వారు

సి) పోర్చుగీసు వారు డి) పై అందరూ

20. ఆంధ్రాలో పోర్చుగీసు స్థావరం?

ఎ) భీమునిపట్నం బి) మచిలీపట్నం

సి) నిజాంపట్నం డి) నరసాపురం

## సమాధానాలు

| | | | | |
|---|---|---|---|---|
| 1) ఎ | 2) బి | 3) సి | 4) డి | 5) సి |
| 6) ఎ | 7) బి | 8) బి | 9) ఎ | 10) సి |
| 11) ఎ | 12) డి | 13) సి | 14) బి | 15) సి |
| 16) ఎ | 17) డి | 18) ఎ | 19) ఎ | 20) బి |

SAKSHI